క్లుప్తంగా

క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు..



తప్పిపోయిన చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న మెరైన్ పోలీసులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో తప్పిపోయిన చిన్నారిని మెరైన్ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పంజాబ్‌కు చెందిన ప్రీత్ సింగ్ తన కుటుంబంతో బీచ్‌లో గడిపేందుకు ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. బీచ్‌లో స్నానాలు చేస్తుండగా తీరం ఒడ్డున ఉంచిన వారి కుమార్తె కవునూర్ కౌర్ తప్పిపోయింది. చిన్నారి లేకపోవడాన్ని గమనించిన తల్లిదండ్రులు తీరమంతా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు చిన్నారిని వెతికి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

ఎట్టకేలకు కేసు నమోదు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెంలో నివాసం ఉంటున్న సంధ్య అనే మహిళపై అదే ప్రాంతానికి చెందిన దుంపరెడ్డి గత నెల 31న కత్తితో దాడి చేశాడు. అదేరోజు బాధిత మహిళ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే కేసు నమోదు చేయకుండా రాజీ చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో సంధ్య మీడియాను ఆశ్రయించింది. న్యాయం చేయకుండా పోలీసు కమిషనర్‌ను ఆశ్రయిస్తానని హెచ్చరించడంతో ఎట్టకేలకు పోలీసులు దంపరెడ్డిపై ఆదివారం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు.

దాడికి పాల్పడ్డారంటూ పరస్పరం కేసులు



దాడిలో చేయి విరిగిపోయిన డొకర లక్ష్మి

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేటలో శనివారం సాయంత్రం ప్రహరీ కూల్చివేసి, ముగ్గురిపై దాడికి పాల్పడిన సంఘటనలో డొకర అప్పలనాయుడు, అతని కుమారుడు హేమసాయి, భార్య లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పలనాయుడు నివాసానికి దగ్గర్లో ఉన్న కృష్ణ, అచ్చిబాబు, సూర్యనారాయణ, సన్యాసి మరో 30 మందితో మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. లక్ష్మిని పరీక్షించిన వైద్యులు చేయి విరిగిపోయిందని, శస్త్రచికిత్స అవసరమని తెలియజేశారు. ఇదిలావుండగా అప్పలనాయుడు కుటుంబ సభ్యులు కూడా తమపై దాడి చేశారని కృష్ణ, అచ్చిబాబు, సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం కృష్ణంరాజుపేటలో విచారణ చేపట్టారు.

చలివేంద్రం ప్రారంభం

పీఎం పాలెం: స్థానిక ఆటో స్టాండ్ వద్ద శ్రీ వీరాంజనేయ ఆటో స్టాండ్ కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మరిన్ని మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడతామని ఆటోల సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగలు మైనర్లే..



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లతో భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్

తగరపువలస: భీమిలి, భోగాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల చోరీకి గురైన 15 సెల్‌ఫోన్లను భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం తెలియజేశారు. తగరపువలస కేవీఆర్ లేడీస్ హాస్టల్‌లో ఈ నెల రెండో తేదీ వేకువజామున చొరబడిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు 13 సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయారు. అదే రోజు రేవళ్ల అనురాధ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్రైమ్ సీఐ బీఎస్ఎస్ ప్రకాష్ పర్యవేక్షణలో సీసీ ఫుటేజీలు పరిశీలించి నేరస్తుల గురించి విచారించగా వీటిని దొంగిలించిన నలుగురు మైనర్లను గుర్తించారు. వారి నుంచి 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోగా వీటిలో 13 కేవీఆర్ లేడీస్ హాస్టల్‌లో పోయినవిగా నిర్ధారించారు. మిగిలిన రెండు సెల్‌ఫోన్లు భోగాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అమ్మ హాస్టల్ నుంచి దొంగిలించినట్టుగా గుర్తించారు. మైనర్లను అదుపులో తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

ఉద్యానం.. అధ్వానం

అభివృద్ధికి ఆమడ దూరంలో జీవీఎంసీ పార్కులు
మౌలిక సదుపాయాలు శూన్యం
లోపించిన పారిశుధ్యం

విద్యుత్ సదుపాయం కల్పించాలి...



కామ్రేడ్ పుచ్చలపల్లి చంద్రయ్య పార్కుకు పూర్తి స్థాయిలో విద్యుత్ లైట్ల సదుపాయం కల్పించాలి. విద్యుత్ లైట్లు లైనందున సాయంత్రం సమయంలో పార్కులో వాకింగ్‌కు ఆటంకంగా ఉంది. విషపురుగులతో ఇబ్బందులు ఉన్నాయి. అలాగే పార్కులో పారిశుధ్యం మెరుగుపరచాలి.
–ఇ. చంద్రశేఖర్ గాంధీ, బింద్రానగర్



కనీస అభివృద్ధికి నోచుకోని హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కు

అభివృద్ధికి నోచుకోని హౌసింగ్ బోర్డు కాలనీ పార్కు

స్థానిక రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీలో గల విశాలమైన పార్కు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ఎటువంటి అభివృద్ధి లేనందున బోడిగా దర్శనమిస్తుంది. కనీసం మొక్కలు కూడా నాటలేదు. పార్కు చుట్టూరా ప్రహరీ నిర్మించలేదు. వాకర్స్ ఉదయం, సాయంత్రం కాస్త నడవడానికి అనుకూలంగా ట్రాక్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పార్కులో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పీఎంపాలెం: జన సమర్థతతో **సతమతమవుతున్న** పట్టణ వాసులకు ఉదయం, **సాయంత్రం వేళల్లో** కాస్త సేద తీరడానికి అను**కూలంగా జీవీఎంసీ** పార్కులు నిర్మించింది. అంత**వరకూ బాగానే ఉం**ది, కానీ వాటిని అభివృద్ధి **చేయడంలో నిర్లక్ష్యం** చేయడంతో పార్కులకు **కేటాయించిన స్థలాలు** నిరుపయోగంగా మారాయి. స్థానికులకు కనీస ప్రయోజనం అందించలేక అందనంత దూరంలో ఉన్నాయి. అంతో ఇంతో అభివృద్ధి పరిచిన పార్కులు నిర్వహణ లోపం కారణం వెంటాడుతోంది.

పేరుకే పార్కు..

జాతీయ రహదారి నుంచి 8వ వార్డులోని కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పేరున విశాలమైన పార్కు ఉంది. పార్కులో విద్యుత్ దీపాల సదుపాయం ఆశించిన స్థాయిలో లేదు. వాకర్ల కోసం నామమాత్రపు ట్రాక్ ఉంది. ట్రాక్ పొడవునా విద్యుత్ దీపాల సదుపాయం లేకపోవడంతో చీకటి పడితే విషపురుగులతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కులో పేరుకుపోయిన ఎండుటాకులను ఎప్పటికప్పుడు తొలగించడానికి జీవీఎంసీ తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సుందరయ్య పార్కులో పేరుకు పోయిన ఎండుటాకులు

మూలకు చేరిన పిల్లల ఆట సామగ్రి

ఒకప్పుడు తుసీనగర్ పార్కు మిగతా పార్కులకు మోడల్‌గా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పార్కుకు వచ్చే చిన్న పిల్లల కోసం నిర్మించిన ఆట సామగ్రికి ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో ఒక్కొక్కటీ మూలకు చేరుతున్నాయి. పిల్లలు ఆడుకోవడానికి ఇనుప గొలుసులతో నిర్మించిన ఊయలలు మరమ్మతులకు గురయ్యాయి. ప్రస్తుతం నిరుపయోగంగా అలంకార ప్రాయంగా పడి ఉన్నాయి. తూగుడు బల్లల పరిస్థితీ ఇదే. పిల్లలు పట్టుకునే పైపులకు తుప్పు పట్టడంతో వాటిని ఉపయోగిస్తే చేతులు తెగిపోయే ప్రమాదం ఉంది. ఈ కారణంగా వాటి జోలికి ఎవరూ వెళ్లడం లేదు.



వృథాగా జారుడు బల్ల



నిరుపయోగంగా ఆట పరికరాలు

ఏఎస్సార్ నగర్ పార్కులు అధ్వానం

జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎంపాలెం అల్లూరి సీతారామరాజు నగర్‌లోని పార్కులు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఈ కాలనీ పరిధిలోని రెండు పార్కులలో పిచ్చితుప్పలు ఆవరించాయి. స్థానిక వాకర్స్ కోసం నిర్మించిన ట్రాక్‌ల పొడవునా తుప్పా డొంకలతో నిండిపోయాయి. పార్కుల రక్షణ కోసం చుట్టూరా ప్రహరీ నిర్మించలేదు. పార్కులోకి వచ్చేవారికి మంచి నీటి సౌకర్యం కోసం నిర్మించిన బోరు నిరుపయోగంగా మారింది.



ఏఆర్ఎస్‌నగర్‌లోని పార్కు దుస్థితి

మొక్కలకు నీటి సదుపాయం కల్పించాలి



వేసవి కారణంగా పార్కులోని మొక్కలు ఎండి పోతున్నాయి. జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మొక్కలకు ప్రతిరోజూ నీటిని అందించాలి. పార్కులో పచ్చదనం పెంపునకు మరిన్ని చర్యలు తీసుకోవాలి.
–ఎస్. మురళి, బింద్రానగర్

రాములోరి కల్యాణం ..కమనీయం

భీమునిపట్నం: భీమిలిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడ పెద్ద బజారు సుభాష్‌రోడ్డులో ఉన్న వీరమట్టి రామాలయం, రొట్టెలవీధి రామాలయం, మంగలవీధి, బోయివీధి, తోటవీధి, చిన్నబజారు సమీపంలోని కొండపేట ప్రాంతాల్లోని రామాలయాల్లోను ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద ఘనంగా సీతారాముల కల్యాణం జరిగింది. అలాగే షిర్డీసాయిబాబా ఆలయం వద్ద షిర్డీ సాయిబాబు జయంతి ఉత్సవంతోపాటు సీతారాముల కల్యాణంకూడా జరిగింది.

నేత్ర పర్వంగా..

మధురవాడ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మధురవాడ, పరిసర ప్రాంతాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి.చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో సీతారాముల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యవర్గ సభ్యులు పీవీజీ అప్పారావు, యస్ఎస్ఎన్ మూర్తి, సెక్రటరీ నాగోతి తాతారావు, పిళ్లా శ్రీనివాసరావు తదితరుల పర్యవేక్షణలో పట్నాల హరిప్రసాద్ శర్మ, హరి స్వాముల ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం మధురవాడకి చెందిన చిలుకూరి సత్యశ్రీనివాస్, కాశీ అన్నపూర్ణ కుమారులు చిలుకూరి సంతోష్ సహకారంతో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. దర్భలతో తయారు చేసిన తాడును సీతమ్మవారికి వడ్డానంగా అలంకరించడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో ధర్మకర్త బంగారు లక్ష్మి, ధర్మకర్తల మండలి సభ్యులు వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంకాయల మారుతీ ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు అశోక్, ప్రకాష్, తెంటు మాధవి పాల్గొన్నారు. మారికవలస ఆర్జీకే న్యూ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఐటీ సెజ్ జంక్షన్ లోని మానం ఆంజనేయులు కాలనీ శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం, అన్న ప్రసాద వితరణ, పల్లకీ సేవ నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



గంభీరం హరేకృష్ణ వైకుంఠంలో సీతారాముల కల్యాణ వేడుకలు



రొట్టెల వీధి రామాలయంలో నవమి వేడుకల్లో భక్తులు



దుర్గాలమ్మ ఆలయంలో అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు



జీరుపేట రామాలయంలో కల్యాణ వేడుకలలో పాల్గొన్న జంటలు



సంతపేట కుమ్మరివీధిలో సారెతో సీతారాములను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఊరూవాడా కల్యాణరాముని వేడుకలు

తగరపువలస: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం గ్రామగ్రామాన సీతారామాలయాలలో కల్యాణరాముని వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదన మోహన్ మందిరంలో భక్తదాస, అంబరీషదాస ఆధ్వర్యంలో కల్యాణం అనంతరం రామచంద్రుని ప్రాముఖ్యత గురించి భక్తులకు వివరించారు.



మధురవాడ టైలర్స్ కాలనీలోని ఉత్సవ మూర్తులు



మద్దిలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం

- పాలవలస పంచాయతీ గుడిలోవ సీతారామాలయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు అక్కుభట్ల శర్మ కల్యాణం అనంతరం శ్రీరామనవమి ప్రవచనాన్ని వివరించారు. 43 జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి. అఖిల భారతి విద్యాభారత అధ్యక్షుడు దూసి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. మండలంలోని పెద్దిపాలెం, దుక్కవానిపాలెం, పాలవలస, పాడుగుపాలెం, రామవరం, కుసులవాడ, గొట్టిపల్లి, గిడిజాల, బోని, ముచ్చర్ల, బోయిపాలెం తదితర గ్రామాలలో కల్యాణ వేడుకలు, అన్నప్రసాద వితరణ జరిగింది.
- జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల పరిధిలో రెడ్డి సంతపేట, రజక సంతపేట, కుమ్మరివీధి, చిట్టివలస జ్యూట్ మిల్లు రామాలయం, మెయిన్ రోడ్డు, వలందపేట, గాంధీ బొమ్మవీధి, సత్యసాయిసేవా సమితి, సంగివలస, చిల్లపేట, జీరుపేట రామాలయాలలో కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకలలో రంగూరి సీతారామదొర, జీరు వెంకటరెడ్డి, ఆదిమూలం నాగరాజు, పట్నాల రాము, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- భీమిలి మండల పరిధిలో మూలకుద్దు, శింగనబంధ, కృష్ణంరాజుపేట, అన్నవరం, పాతపాలెం, చిప్పాడ, టి.నగరపాలెం, తాటితూరు, మజ్జివలస, లక్ష్మిపురం, తాళ్లవలస, దాకమర్రి, అమనాం గ్రామాలలో కూడా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవ నిర్వహించారు.

కనుల పండువగా..

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, మద్ది, విలాస్కాన్‌పాలెం, అనంతవరం, గంధవరం, ఐనాడ, కోరాడ, బి.ఆర్.తాళ్లవలస, రెడ్డిపల్లి గ్రామాల్లో ఈ కల్యాణాన్ని నిర్వహించారు. మద్దిలో జరిగిన ఈ కల్యాణంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు పాల్గొన్నారు.



శిల్పారామంలో కోలాట ప్రదర్శన

ముత్యాల తలంబ్రాలు సమర్పణ



ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి దంపతులు

పీఎంపాలెం: పీఎంపాలెం మూడో బస్టాప్‌నకు సమీపంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద సీతారాములు కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. జాతర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో వాకర్స్ సభ్యులు పాటల పందిరి సభ్యులు పాల్గొన్నారు. శ్రీ రామ నవమి ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 6గంటలకు శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన కోలాటం , శాస్త్రీయ నృత్యపదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

వైభవంగా సీతారాముల కల్యాణం

కొమ్మాది: వాడవాడలా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిపారు.శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమ ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున 4.30 గంటలకు మంగళహారతి, 7.30 గంటలకు దర్శన హారతి, 8 గంటలకు శ్రీరామ కథ, 8.30 గంటలకు శోభాయాత్ర, 10 గంటలకు సీతారాముల కళ్యాణం నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు మహాన్నస మారాధన నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు భజన, కీర్తన, 6 గంటలకు అభిషేకం, 8 గంటలకు గౌర హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని, వంశీకృష్ణ ప్రభు తదితరులు పాల్గొన్నారు. బీచ్‌రోడ్డు మంగమారిపేటలోని శ్రీ హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలోనూ, వారిజా హయగ్రీవ మందిరంలోనూ, అదేవిధంగా కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, జేవీఅగ్రహారం, ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల్లోని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



మధురవాడలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మధురవాడ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మధురవాడలోని వివిధ ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మధురవాడ మండల ఇన్‌చార్జ్ ఉప్పిలి వంశీ యాదవ్, ఇతర నాయకులు పి. శ్రీనివాసరావు, పోతిన పైడిరాజు, భీమిలి నియోజకవర్గ కో కన్వీనర్ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

తగరపువలస: అంబేడ్కరు కూడలిలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. 1,2 వార్డుల అధ్యక్షుడు చిల్ల త్రినాథరెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు.

పద్మనాభం: పద్మనాభంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆ పార్టీ భీమిలి నియోజకవర్గం కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు పార్టీ జెండా ఎగుర వేశారు.

- పద్మనాభం బీజేపీ మండల కార్యాలయంలో పార్టీ మండల శాఖ అధ్యక్షురాలు నాగమణి జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

భీమునిపట్నం: బీజేపీ బలోపేతానికి అందరు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.


ఓక్రిడ్జ్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ వేడుకలలో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. గ్రేడ్ 12 సీబీఎస్ఈ, ఐబీడీపీ విద్యార్థుల శోభాయాత్రతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక నృత్య ప్రదర్శన జరిగింది. ఈ రెండు గ్రూపుల నుంచి ఒక్కొక్కరిని వాలెడిక్టోరియన్‌గా ఎంపిక చేసి సత్కరించారు. ప్రతి కార్యక్రమంలో విద్యార్థులు వివిధ అంశాలలో ప్రావీణ్యతను ప్రదర్శించగా వాలెడిక్టోరియన్‌లు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ విద్యార్థుల అకడమిక్, వ్యక్తిగత విజయాలను ప్రస్తావిస్తూ ధర్మబద్ధత, దయాగుణాల ప్రాధాన్యాన్ని వివరించారు. చివరగా ముఖ్య అతిథి నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టోఫర్ షార్ట్ మాట్లాడారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత భాస్కరరాజుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన దంతులూరి భాస్కరరాజు రూ.లక్ష 116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున ప్రొటోకాల్ సూపరింటెండెంట్ దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అధికారులు అందించారు.